క్లుప్తంగా

నేడు 'మనూ'లో 'అందరికీ విద్య'

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌ఈ అండ్‌టీ) ఆధ్వర్యంలో భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా 'అందరికీ విద్య' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం జరుగుతుందని ఎస్‌ఈ అండ్ టీ డీన్ ప్రొఫెసర్ ఎం వనజ తెలిపారు.. మంగళవారం ఉదయం 11 గంటలకు క్యాంపస్‌లోని డీడీఈ ఆడిటోరియంలో ఉపాధ్యాయ దినోత్సవం కూడా జరుగుతుందన్నారు.

25 మంది విద్యార్థులు ఎంపిక

రాయదుర్గం: మనూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్‌తో ఫ్యాక్ట్‌సెట్ కంపెనీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అధికారులు సోమవారం సమావేశమయ్యారు. సంస్థ అధికారులు వెంకట సత్యకృష్ణ, మహేష్‌లు వీసీకి జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఇన్‌చార్జీ డాక్టర్ యూసుఫ్‌ఖాన్ పర్యవేక్షణలో కంప్యూటర్ ఆధారిత హ్యాకర్ ర్యాంక్ టెస్ట్ అసెస్‌మెంట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో ఎంబీఏ, ఎంకామ్, బీకామ్ విద్యార్థులు హాజరయ్యారు. ప్రతిభ చాటిన వారిలో 25 మందిని ఎంపిక చేశారు.

7న శాంతిసరోవర్‌లో కృష్ణాష్టమి

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఈనెల 7వ తేదీన కృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6 గంటల నుంచి శాంతిసరోవర్ క్యాంపస్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో ఈ వేడుకలను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, మెడిటేషన్ వంటివి నిర్వహిస్తారు.

వాల్ రైటింగ్ జోరు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): త్వరలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష నేతలు జోరుగా ప్రచారాలు మొదలుపెట్టారు. ప్రజలను ఆకర్షించేందుకు ఫ్లెక్సీలు, హోర్డింగ్ లను ఏర్పాటు చేసేవారు. కానీ గత కొద్దిరోజులుగా గోడలపై రాతలు మొదలుపెట్టారు. అధికార పార్టీ నేతలు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను గోడలపై రాయిస్తున్నారు. ఇక ప్రతిపక్ష నేతలు వారు అధికారంలోకి వస్తే ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను రాయిస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కాటా శ్రీనివాస్‌గౌడ్‌ల వాల్ రైటింగ్‌లు నియోజకవర్గంలో దర్శనమిస్తున్నాయి. గత 15 ఏళ్ల తర్వాత వాల్ రైటింగ్‌లు చూస్తున్న స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తూ జోరుగా చర్చించుకుంటున్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

పటాన్‌చెరు: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కాట శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం అమీన్‌పూర్ గ్రామంలో శ్రీ బద్ది పోచమ్మ- మారెమ్మ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు శ్రీనివాస్‌గౌడ్‌ని సన్మానించారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ రమేష్, మాజీ వార్డ్ మెంబర్ రవీందర్, ఆశగారి లక్ష్మణ్, ఎన్ నరసింహ, కుమార్, ఆశయ్య, సత్తయ్య, శ్రీరాములు, శ్రీను, కేశవులు, మహేష్, సురేష్, శివ, రాము పాల్గొన్నారు.

నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం

పటాన్‌చెరు టౌన్: ఆపత్కాలంలో నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడకు చెందిన బాయమ్మ అనారోగ్యంతో బాధపడుతోంది. మెరుగైన వైద్యం కోసం స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా సీఎం ఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన రెండు లక్షల రూపాయల ఎల్‌ఓసిని బాయమ్మ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సోమవారం క్యాంప్ కార్యాలయంలో అందచేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్,బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాజు, వెంకటేష్ గౌడ్, అశోక్, భాస్కర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలపై సదస్సు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు అనే అంశంపై సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐపీఈ అకాడమీ నుండి నాగేశ్వర్ రెడ్డి విచ్చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వివిధ శాఖల నోటిఫికేషన్, ఖాళీల గురించి వివరించారు. అనంతరం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవాలని పిలుపునిచ్చారు. పోటీ పరీక్షల పట్ల ఆసక్తిని పెంచుకుని వీలైనన్ని ఎక్కువ పరీక్షలు రాయాలని వైస్ ప్రిన్సిపల్ అల్లం రెడ్డి సూచించారు. ప్రభుత్వ ఉద్యోగం ద్వారా ప్రజా సేవ సాధ్యపడుతుందని డాక్టర్ రాజిరెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి హరిత, చంద్రశేఖర్, స్వాతి తదితర ఉపన్యాసకులు పాల్గొన్నారు.

ఇటు పార్కింగ్.. అటు సంత

- మహిళా భవనాన్ని ఇలా ఉపయోగిస్తున్నారు • పైగా చెత్త పారబోత.. దోమల స్వైర విహారం



మహిళా భవనం



మహిళా భవనం ఎదురుగా వాహనాల పార్కింగ్

హాఫీజ్‌పేట్: హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మహిళా భవనం నిరుపయోగంగా ఉంది. దశాబ్దాల క్రితం ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేకంగా భవనం నిర్మించగా కొన్నాళ్ళు పాటు వినియోగించారు. తదనంతరం పట్టించుకో లేదు. గతంలో ఓ మహిళా నాయకురాలు మహిళల కోసం కుట్టుమిషన్ శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసిన అనంతరం మరల ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదు. కాగా ఆమె ఆధీనంలోనే మహిళా భవనం ఉందని పలువురు మహిళలు ఆరోపిస్తున్నారు. కాగా ఈ భవనానికి ప్రహరీ లేకపోవడంతో భవనం ఎదుట వాహనాలు నిలుపుతున్నారు. దీనికితోడు చిరు వ్యాపారుల దుకాణాలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. దీనికి తోడు వారాంతపు సంత కూడా నిర్వహిస్తున్నారు. సంత ముగిసాక భవనం వద్ద పారబోస్తున్నారు. దీంతో దోమలు ప్రబలుతున్నాయి. డివిజన్ పరిధిలోని పలు బస్తీలలో అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దెలు చెల్లిస్తున్నారు. మహిళా భవనంలో కేవలం పేరుకు మాత్రమే యూత్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం ఉంది. జీహెచ్‌ఎంసీ అభివృద్ధి చేయాలని మహిళలు కోరుతున్నారు.

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

- టాస్కులు కమిషన్ల పేరుతో మోసం
- రూ.30 లక్షలు, 4.4 లక్షలు పోగొట్టుకున్న బాధితులు

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.30 లక్షలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడ మైత్రి విలాస్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్ టైం జాబ్ అంటూ తన వాట్సాప్ కు మెసేజ్ వచ్చింది.దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. దీంతో సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడి క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ.2 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలుపెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం 30 లక్షలు చెల్లించాడు. సైబర్ నేరగాళ్ల వాలెట్‌లో నగదుతో పాటు కమిషన్ చూపిస్తూ వచ్చారు. దీంతో ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా అమీన్‌పూర్ పరిధిలోని సురక్ష కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ఆగస్టు 11వ తేదీన టెలిగ్రామ్ ద్వారా జాబ్ ఆఫర్ అంటూ మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు తన వివరాలను నమోదు చేసి నగదు ఇన్వెస్ట్ చేస్తూ ఇచ్చిన టాస్కులు పూర్తి చేస్తూ మొత్తం నాలుగు లక్షల నలభైనాలుగు వేలు ఇన్వెస్ట్ చేశాడు. చివరికి తాను పెట్టినగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి సోమవారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యం

- ఎమ్మెల్యే గాంధీ, ఎంపీ డా.రంజిత్‌రెడ్డి
- శేరిలింగంపల్లి యూపీహెచ్‌సీలో భవన నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్ గాంధీ, చేవెళ్ళ ఎంపీ రంజిత్‌రెడ్డి తదితరులు

శేరిలింగంపల్లి: పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు శేరిలింగంపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్ గాంధీ, చేవెళ్ళ ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డిలు తెలిపారు. శేరిలింగంపల్లి యూపీహెచ్‌సీలో రహేజా గ్రూపు సీఎస్‌ఆర్ ఫండ్స్ రూ.45లక్షలతో నిర్మించే భవనానికి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, అందులో భాగంగా కేసీఆర్ కిట్, బస్తీ దవాఖానాలు, కంటి వెలుగు వంటి, తెలంగాణ డయాగ్నొస్టిక్స్ ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వర్ రావు, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ సృజన, మెడికల్ ఆఫీసర్ కీర్తి శైలజ, బీఆర్‌ఎస్ నాయకులు వీరేశం గౌడ్, శ్రీనివాస్‌రాజ్ ముదిరాజ్, రాజు యాదవ్, రఘునాధ్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

కరోనా పరీక్షలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం 25 మందికి కొవిడ్ ర్యాపిడ్ ఆంటీజన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అదేవిధంగా 22 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు.

అండగా ఉంటాం..

జిన్నారం(పటాన్‌చెరు): చిట్కుల్ సర్పంచ్ నీలం మధుకు తాము అండగా ఉంటామని గుమ్మడిదల గ్రామ ముదిరాజ్ సంఘం నాయకులు తెలిపారు. సోమవారం గుమ్మడిదల గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు నర్సింలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రానున్న ఎన్నికల్లో మధుకు మద్దతు ఇవ్వాలని నాయకులు తీర్మానించారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ మధుకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆంజనేయులు, నాగయ్య, మల్లేశ్, శ్రీశైలం, పాండు, మహిళలు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ అరెస్ట్..

- 7 తులాల ఆభరణాలు స్వాధీనం
- కేసు వివరాలు వెల్లడించిన మాదాపూర్ డీసీపీ సందీప్



చైన్ స్నాచింగ్ కేసు వివరాలను వెల్లడిస్తున్న మాదాపూర్ డీసీపీ సందీప్ తదితరులు

గచ్చిబౌలి: జల్సాల కోసం చైన్ స్నాచింగ్ బాటపట్టిన యువకుడిని మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారని డీసీపీ సందీప్ తెలిపారు. సోమవారం మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. వివేకానందనగర్, బోరబండకు చెందిన రెల్ల కున్నమ్మ(53) ఆగస్టు 28 సాయంత్రం 6.15 గంటల సమయంలో భర్తతో కలిసి పర్వత్‌నగర్ రోడ్డులో వాకింగ్ చేస్తోంది. వెనక నుంచి వచ్చిన ఓ యువకుడు మెడలోని మంగళసూత్రం లాక్కొని ఉడాయించాడు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడు చిన్న కొర్పోల్, నెక్కొండ మండలం, వరంగల్‌కు చెందిన మనుగురు మహిపాల్(27)గా గుర్తించారు. 2014లో నగరానికి వలస వచ్చి తులసీనగర్, బోరబండలో నివాసం ఉంటున్నాడు. జల్సాలకు అలవాటు పడటంతో కూలీ డబ్బులు సరిపోక చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. నిందితుడిని ఆదివారం అదుపులోకి తీసుకొని విచారించగా తానే స్నాచింగ్‌కు పాల్పడినట్లు ఒప్పుకున్నాడని పోలీసులు పేర్కొన్నారు. కాగా ఏప్రిల్ 13న అల్లాపూర్ పీఎస్ పరిధిలో సజ్జా సత్యవతి నడుచుకుంటూ వెళుతుండగా పుస్తెల తాడుతో ఉడాయించినట్లు ఒప్పుకున్నాడు. ఆ రెండు కేసుల్లో 7 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులను డీసీపీ అభినందించారు. వాకింగ్‌కు వెళ్లినప్పుడు నగలు వేసుకోవద్దని జాగ్రత్తగా ఉండాలని డీసీపీ సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి, సీసీఎస్ ఏడీసీపీ నర్సింహారెడ్డి, ఏసీపీ శ్రీనివాస్, డీఐ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలతో డీసీ సమావేశం



బీఎల్‌ఓలతో సమావేశమైన ఉపకమిషనర్ వంశీకృష్ణ

హాఫీజ్‌పేట్ : ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమంలో దరఖాస్తులు భారీగా వచ్చాయని చందానగర్ సర్కిల్ డీసీ వంశీకృష్ణ పేర్కొన్నారు. సోమవారం సర్కిల్ 21 కార్యాలయంలో ఎన్నికల అధికారులు, బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఓటర్ నమోదు కొరకు సుమారు 8వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్ళి పరిశీలించాలన్నారు. ఈ నెల 19 వరకు దరఖాస్తుల పరిశీలన పూర్తి చేస్తామని అక్టోబర్‌లో విడుదల చేసే తుది జాబితాలో నూతన ఓటర్లు, సవరణలు చేసుకున్న వాటిని కూడా పొందుపరుస్తామన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ సురేష్, సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, బీఎల్‌ఓ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రెండు కోట్ల రూపాయలతో ఉసికేబావి కల్వర్టు

- నిర్మాణ పనులకు శంకుస్థాపన
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



ఉసికేబావి కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్

పటాన్‌చెరు: దశాబ్దకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉసికేబావి కల్వర్టు నిర్మాణ పనులకు శాశ్వత పరిష్కారంగా రెండు కోట్ల రూపాయలు కేటాయించడంతోపాటు, శరవేగంగా పనులు పూర్తి చేయిస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని నవ్య కాలనీ, గ్రీన్ మెడోస్, గ్రీన్ ఫీల్డ్ కాలనీలలో రెండు కోట్ల 95 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 14వ వార్డు పరిధిలోని ఉసికేబావి నుండి రామచంద్రాపురం డివిజన్ నుండి జాతీయ రహదారికి అనుసంధానం చేసే విధంగా నూతన కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే సుమారు 30 కాలనీల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. అభివృద్ధి పనుల విషయంలో రాజీ పడబోమన్నారు. సీసీ రోడ్లు అంతర్గత మురుగునీటి కాలువలతో పాటు పార్కులు చెరువులను సుందరీకరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహగౌడ్, కౌన్సిలర్లు కవిత శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ, చంద్రకళ గోపాల్, బాలమణి బాలరాజు, ప్రమోద్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు యూనూస్, బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ కమిటీ చైర్మన్ తులసిరెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

డా. అంబేడ్కర్ భవనం ప్రారంభం



అంబేడ్కర్ భవనాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ గాంధీ, ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి గోపీనగర్‌లో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనాన్ని ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ, ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డిలు స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం జన చైతన్య ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షులు నర్సింహ అతిథులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ ఎస్ నాయకులు వీరేశంగౌడ్, రాజేశ్వరమ్మ, రాజు యాదవ్, ఖాసీం, హబీబ్, శ్రీనివాస్‌యాదవ్, పద్మారావు, అభిషేక్ యాదవ్, గోపాల్‌యాదవ్, రవీందర్ రాథోడ్, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ కోసం సైకిల్ యాత్ర

శేరిలింగంపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావాలని మహారాష్ట్రలోని శ్రీ తుల్జా భవానీ ఆలయం వరకు చేపట్టిన సైకిల్‌యాత్రను శేరిలింగంపల్లి తారానగర్‌లో కార్పొరేటర్ నాగేందయాదవ్ సోమవారం ప్రారంభించారు. తారానగర్‌లోని శ్రీ తుల్జా భవానీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన వి.శ్రీనివాస్ ఐదుగురు మిత్రులతో కలిసి సైకిల్ యాత్ర ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వీరేశంగౌడ్, రాంచందర్, గోపాల్‌యాదవ్, రవికుమార్, పాండు ముదిరాజ్, లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గ్లాస్‌లు అందజేత

రామచంద్రాపురం (పటాన్‌చెరు): రామచంద్రాపురం మండలంలోని ఇందిరానగర్ కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉమెన్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం గ్లాస్‌లను పంపిణీ చేశారు. ప్రభుత్వం జావను ఇస్తున్న నేపథ్యంలో అసోసియేషన్ ప్రతినిధులు గ్లాసులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎలీన్‌రాణి, నిర్వాహకులు దీప్తి, భార్గవి, స్వాతి, జ్యోతి, శ్వేతలతో పాటు , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

హాఫీజ్‌పేట్ : గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. లింగంపల్లి రైల్వే స్టేషన్ 6వ నంబర్ ప్లాట్‌ఫారం వైపు ఉన్న సులభ్ కాంప్లెక్స్ వద్ద ఓ వ్యక్తి (40) మృతి చెందాడని స్థానికులు సోమవారం చందానగర్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు ఘటనాస్థలానికి వెళ్ళి పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

వ్యవసాయ రంగం బలోపేతానికి కృషి

సాక్షి సిటీబ్యూరో: వ్యవసాయ రంగానికి సేవ చేయాలనే లక్ష్యంతో అంతర్జాతీయ పరిశోధనా సంస్థలు, కంపెనీలతో సహకారం పెంచడానికి కృషి చేస్తున్నామని గ్రోవేర్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ దేవేంద్ర దాసరి తెలిపారు. రైతులకు సాధికారత కల్పించడంతో పాటు దేశంలో వ్యవసాయ పద్ధతులను విప్లవాత్మకంగా మార్చడానికి ఏర్పాటు చేసిన గ్రోవేర్ టెక్నాలజీస్ నూతన కార్పోరేట్ కార్యాలయాన్ని సోమవారం హైటెక్ సిటీ వేదికగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈఓ నవదీప్ మెహతా మాట్లాడుతూ., వ్యవసాయ స్థిరత్వాన్ని మెరుగుపరచడం, రైతులకు ఆదాయ మార్గాలను పెంచడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నామన్నారు. గ్రోవేర్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో కలుపు మొక్కలు, క్రిమి సంహారకాలు, శిలీంద్రాలు తదితరాలు 140కి పైగా సాంకేతిక ఉత్పత్తులను అందిస్తుందని సేల్స్ హెడ్ పొన్నం భాస్కర్ వివరించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్స్ పీజే శ్రీకాంత్, వేముల సురేష్, సేల్స్ హెడ్ ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



నల్లపోచమ్మ ఆలయ కమిటీ ఎన్నిక



ఎమ్మెల్యే గాంధీని కలిసిన కమిటీ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2లోని నల్లపోచమ్మ ఆలయ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడు పోలోజు భగవంతాచారి, ఉపాధ్యక్షుడు రమణాచారి, ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, ఉప కార్యదర్శి ఈశ్వరుజు శైలేష్, కోశాధికారి బి. రవి, కమిటీ సభ్యులు మ్యాడరం ప్రముఖ చారి, రాములు గోవిందుల కిరణ్, కందుకూరి శ్రీవన్ శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరిలు సత్యవతి, అనురాధ, సలహాదారులు సాంబయ్య, సత్యానారాయణ, కనకాచారి, రఘువంశీలను ఎన్నుకున్నారు. అనంతరం వీరు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు భగవంతాచారి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి పాటుపడతామన్నారు.



ఘనంగా కాటమయ్యస్వామి బోనాలు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలో శ్రావణమాస బోనాల వేడుకలను కాటమయ్య స్వామి ఆలయం వద్ద సోమవారం సాయంత్రం నిర్వహించారు. కాటమయ్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమాన్ దేవాలయం నుంచి తొట్టెలు ఊరేగింపుగా వచ్చి స్వామివారికి సమర్పించారు. అనంతరం మహిళలు బోనాలను సమర్పించారు. ఈ వేడుకల్లో పోతురాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కాటమయ్య యూత్ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

అక్షరాస్యతలో శిక్షణ

సాక్షి, సిటీబ్యూరో: విభిన్న నేపథ్యాలు కలిగిన మహిళలకు అండదండలు అందించే లక్ష్యంతో వై4డీ ఫౌండేషన్‌తో కలిసి ప్రముఖ ఎఫ్‌ఎమ్‌సిజి కంపెనీ హిందూస్తాన్ కోకోకోలా బెవరేజస్ ఆధ్వర్యంలో మహిళలకు ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత అందించనున్నామని సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. నగరంతో సహా దేశవ్యాప్తంగా 25వేల మందికి శిక్షణ అందించనున్నామన్నారు.

'ఫస్ట్ రెస్పాండర్లు' 43 మందికి శిక్షణ పూర్తి



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 'ఫస్ట్ రెస్పాండర్ల'కు రెండు రోజుల శిక్షణ సోమవారం పూర్తైంది. హెచ్‌సీయూ, ఈఎంఆర్‌ఐ హెల్త్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో మొదటి విడతలో 43 మందికి శిక్షణ ఇచ్చారు. అభ్యాసకులకు మొదటిరోజు శిక్షణలో భాగంగా సాధారణ వైద్యం, గాయం, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలో నేర్పించారు. రెండవ రోజు టాస్క్‌లు ఇచ్చారు. ఈఎంఆర్‌ఐలోని మాస్టర్ ట్రైనర్లు, ఇన్‌స్ట్రక్టర్లచే వీరికి ప్రత్యేక శిక్షణ అందించారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ గీతా వేముగంటి శిక్షకులను అభినందించారు. శిక్షణలో ఈఎంఆర్‌ఐ-జీహెచ్‌ఎస్ డైరెక్టర్ డాక్టర్ జీవిరమణ పర్యవేక్షణలో ప్రతినిధులు డాక్టర్లు రవీనా,జావిద్, సతీష్, శిక్షణ అందించారు.